నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | KAMAREDDY

## రథోత్సవం



**నిజామాబాద్** జిల్లా కేంద్రంలోని నీల కంఠేశ్వరుడి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీరిన గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగించగా.. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భజనలు, కోలాటాలతో రథోత్సవ శోభాయాత్రలో పాల్గొన్నారు.
–సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4

# నిర్లక్ష్యం వీడింది.. ముసుగు పడింది

- యంత్రాంగాన్ని మేల్కొలిపిన 'నమస్తే తెలంగాణ'
- వారం రోజులుగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- 'నమస్తే' కథనంతో నిద్ర మత్తు వీడిన అధికారులు
- వివిధ పార్టీల నేతలు, జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగు
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళా అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు

నిజామాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)
జిల్లా అధికారులు ఎట్టకేలకు నిద్ర లేచారు. విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వివిధ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయకపోవడాన్ని ఎత్తి చూపుతూ 'కోడ్ కూసినా నిద్ర లేవని యంత్రాంగం' శీర్షికన నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనంతో అధికారులు నిద్ర మత్తు వీడారు. వివిధ కూడళ్లలో ఉన్న ప్రతిమలకు మంగళవారం ముసుగులు వేయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల వేళా రాష్ట్రంలో దాదాపుగా సగాని కన్నా ఎక్కువ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజవర్గానికి, ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వారం క్రితమే జనవరి 29న విడుదలైన షెడ్యూల్‌తో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈసీ నిబంధనల మేరకు పారదర్శక ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీలతో సంబంధం కలిగి ఉన్న నేతలు, జాతీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను ప్రజా బాహుళ్యానికి కనిపించకుండా చేయాలి. ఇందుకోసం వివిధ కూడళ్లలో ఉన్న విగ్రహాలకు ముసుగు వేయాలి. తద్వారా ఓటర్లను ప్రభావితం కాకుండా చూడడం ఈసీ కనీస బాధ్యత. ఈ నిబంధనలు తూ.చ. తప్పకుండా ఆయా జిల్లా ఎన్నికల అధికారులు అమలు చేశారు. కానీ నిజామాబాద్‌లో మాత్రం ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. ఎన్నికల కోడ్‌తో తమకు సంబంధమే లేదన్నట్లుగా వారం రోజులుగా చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయింది.



ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు ముసుగువేసిన అధికారులు

### నిద్ర మత్తు వీడింది..

ఈ క్రమంలోనే జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' మంగళవారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. వారం రోజులుగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతున్న అంశాన్ని, జిల్లా ఎన్నికల అధికారుల వైఫల్యం, బాధ్యతారాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో నిద్ర లేచిన ఉన్నతాధికారులు ఒక్కసారిగా ఉన్నఫళంగా సిబ్బందిని పురమాయించి నిజామాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న విగ్రహాలకు ముసుగు వేయించారు. జిల్లా అంతటా విగ్రహాలను వస్త్రాలతో కప్పేయాలని ఆదేశాలిచ్చారు. నిజామాబాద్‌లో ఇద్దరు ఐఏఎస్ అధికారులతో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్, ముగ్గురు ఆర్డీవోలున్నారు. కీలక పదవుల్లో ఉన్న వీరందరికీ ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్నది. ఎమ్మెల్సీ ఎన్నికలకు కరీంనగర్ కలెక్టర్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఉన్నప్పటికీ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాల్సిన కనీస బాధ్యత వీరిదే. కానీ వారం రోజుల నుంచి కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా పట్టించుకోక పోవడంపై వివిధ పార్టీల నేతలు, ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు. కావాలనే రెండు జాతీయ పార్టీలకు లాభం చేకూర్చేందుకే నిర్లక్ష్యం ప్రదర్శించారా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కోడ్ ఉల్లంఘన పేరుతో సామాన్యులను చిత్రహింసలకు గురి చేసే అధికార యంత్రాంగమే ఇప్పుడు నియమావళిని ఉల్లంఘించిన అంశం లో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా.. లేదా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

# అక్రమ నిర్బంధం..

- మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు
- 'అసెంబ్లీ ముట్టడి'ని అడ్డుకున్న పోలీసులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

మోర్తాడ్/ధర్పల్లి/సిరికొండ/ఆర్మూర్ టౌన్/భీమ్‌గల్/బోధన్ రూరల్, ఫిబ్రవరి 4: సర్పంచులకు అందాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాజా మాజీ సర్పంచులు చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి'ని ఉమ్మడి జిల్లాలో పోలీసులు అడ్డుకొన్నారు. ముందస్తు అరెస్టులు చేశారు. మోర్తాడ్, ధర్పల్లి, సిరికొండ, ఆర్మూర్, బోధన్ తదితర మండలాల్లో తాజా మజీ సర్పంచులను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**కక్ష గట్టిన రేవంత్ సర్కార్**

తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను అడగడానికి వెళ్తే అరెస్టు చేయడం శోచనీయమని తాజా మాజీ సర్పంచులు అన్నారు. ఏడాదిగా బిల్లుల ఊసేలేదన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు పొందిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా కక్షగట్టి ఇండ్లకు వచ్చి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా వారిని మరింత ఊబిలోకి నెట్టడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, లేదంటే పాలన చేతకాదని ఒప్పుకోవాలన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇచ్చి వారిని గౌరవంగా చూడాలని సుద్దపూస మాటలు మాట్లాడి ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సర్పంచులపై కక్షగట్టి ఏడాదిగా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు.



సిరికొండ పోలీసు స్టేషన్‌లో మాజీ సర్పంచులు



మాజీ సర్పంచులను అరెస్టు చేసిన బోధన్ రూరల్ పోలీసులు

# ల్యాబ్‌కు నమూనాలు

- పౌల్ట్రీ ఫారాలను సందర్శించిన అధికారులు
- అంతుచిక్కని వైరస్‌తో కోళ్ల మృత్యువాతపై వివరాల సేకరణ



లక్కోరలోని కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

వేల్పూర్, ఫిబ్రవరి 4: అంతుచిక్కని వైరస్‌తో ఉమ్మడి జిల్లాలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. వారం వ్యవధిలో వేల్పూర్, భీమ్‌గల్ మండలాలతోపాటు బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్, చించోలిలో లక్షకు పైగా కోళ్లు చనిపోవడంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా అంతుచిక్కని వైరస్‌తో కోళ్లు చనిపోతున్నా .. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ పరిస్థితిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'పౌల్ట్రీ రైతుకు వైరస్ దెబ్బ' శీర్షికన ఈ నెల4న కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. మంగళవారం వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామంలో కొట్టాల గోవర్ధన్ కోళ్ల ఫారాన్ని జిల్లా పశువైద్య అధికారి గంగాధరయ్య, అసిస్టెంట్ డైరక్టర్ జియావుద్దీన్,స్థానిక పశువైద్య అధికారి సంతోష్‌రెడ్డి సందర్శించారు. వైరస్‌తో మృతి చెందిన కోళ్లను పరిశీలించి వాటి రక్త నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు తరలించారు. వైరస్ ఎప్పటి నుంచి సోకిందని, ఇప్పటి వరకు ఎన్ని కోళ్లు మృతి చెందాయనే విషయాలను నిర్వాహకుడిని అడిగితెలుసుకున్నారు.

**పశువైద్యశాలకు వెళ్తే ఖాళీ కుర్చీలే..**

మండల పశువైద్యశాల ఉన్నా అక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏవైనా ఇబ్బందులు ఏర్పడి హాస్పిటల్‌కు వెళ్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని, దీంతో తాము ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**పొతంగల్ మండలంలో 4,600 కోళ్ల మృతి**

పొతంగల్, ఫిబ్రవరి 4: మండలంలోని చైతన్‌నగర్‌లో ఉన్న కోళ్ల ఫారంలో అంతుచిక్కని వైరస్‌తో కోళ్లు మృత్యువాత పడ్డాయి. సోమ, మంగళవారాల్లో సుమారు 4,600 కు పైగా కోళ్లు మృతి చెందినట్లు కోళ్లఫారం యజమాని జల్లాపల్లి గ్రామానికి చెందిన అజిమిర రవి తెలిపాడు. సుమారు రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. చనిపోయిన కోళ్లను గ్రామ శివారులో పాతి పెట్టినట్లు తెలిపాడు.

# రైతులకు నోటీసులు

- రుణమాఫీపై మాట తప్పిన ప్రభుత్వం
- సగం మంది రైతులకు మొండి చేయి చూపిన సర్కారు
- మాఫీ మీద ఆశతో రెన్యూవల్ చేసుకోని అన్నదాతలు
- నోటీసులు పంపుతున్న బ్యాంకర్లు
- లబోదిబోమంటున్న కర్షకులు

బీబీపేట్, ఫిబ్రవరి 4: ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు బ్యాంకర్ల తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుణమాఫీ చేయక రేవంత్ సర్కారు మోసగిస్తే, లోన్లు రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకర్లు వేధిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకులు నోటీసులు పంపుతుండడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందర ఊదరగొట్టింది. తీరా అధికారంలోకి వచ్చాక కొంత మందికే మాఫీ చేసి, మిగతా వారికి మొండిచేయి చూపింది. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న నమ్మకంతో రైతులు లోన్లు రెన్యూవల్ చేసుకోలేదు. దీన్ని ఆసరాగా తీసుకుని బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తరచూ నోటీసులు పంపుతున్నారని బీబీపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మోసగించిన కాంగ్రెస్..**

ఓట్ల కోసం రైతులపై వరాలు కురిపించిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కాక మోసం చేసింది. రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా, కౌలు రైతులకు రూ.12 వేల ఆర్థిక సాయం, అన్ని పంటలకు రూ.500 బోనస్ వర్తింపు వంటి హామీలెన్నో ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేక చేతులెత్తేసింది. ఉమ్మడి జిల్లాలో కొంత మందికే మాఫీ చేసిన రేవంత్ సర్కారు.. సగానికంటే ఎక్కువ మంది రైతులకు రిక్త'హస్తం' చూపింది. అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్.. సన్నవడ్లకు మాత్రమే అంటూ రైతాంగాన్ని నిలువునా ముంచింది. మరోవైపు, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మొదటికే మోసం చేసింది. కనీసం కేసీఆర్ ఇచ్చినట్లు రూ.10 వేలు అయినా ఇవ్వకుండా రెండు సీజన్లలో పెట్టుబడి సాయం ఎగ్గొట్టింది. బీఆర్‌ఎస్ పోరాటాలతో దిగివచ్చిన ప్రభుత్వం జనవరి 26 నుంచి రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామ రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం ఇచ్చి మిగతా వారిని విస్మరించింది.

**బ్యాంకర్ల ఒత్తిడి..**

పంట రుణాలు తిరిగి చెల్లించవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మాఫీ చేస్తుందని రేవంత్‌రెడ్డి సహా ఆ పార్టీ నేతల ప్రకటనలను రైతులు నమ్మి మోసపోయారు. కాంగ్రెస్ నాయకుల మాటలతో చాలా మంది రైతులు లోన్లు రెన్యూవల్ చేసుకోలేదు. అయితే, రేవంత్ సర్కారు కొందరికే మాఫీ చేసి, మిగతా వారిని వదిలేసింది. ప్రభుత్వం మాఫీ చేయకపోదా? అన్న నమ్మకంతో ఇప్పటికీ చాలా మంది అన్నదాతలు లోన్లు రెన్యూవల్ చేసుకోవడం లేదు. మరోవైపు, బ్యాంకర్లు మాత్రం కచ్చితంగా రెన్యూవల్ చేసుకోవాల్సిందేనని రైతులను వేధిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మరీ నోటీసులు ఇస్తూ ఒత్తిడి తెస్తున్నారు.

**కమీషన్ల పర్వం**

బ్యాంకు నోటీసులు అందుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. లోన్ రెన్యూవల్ చేసుకోకుంటే లోన్ రికవరీ కింద ఎక్కడ తమ భూములు వేలం వేస్తారోనని భయపడుతున్నారు. మరోవైపు, వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునేందుకు సిద్ధపడుతున్నప్పటికీ, అసలుతో పాటు మిత్తీ చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో పరువు పో కూడదన్న భావనతో డబ్బుల కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కర్షకుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు కమీషన్ దందాకు తెర లేపారు. లోన్ రెన్యూవల్‌కు కావాల్సిన మొత్తాన్ని సమకూర్చుతూ, అందుకు గాను కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఈ మేరకు బీబీపేట్ యూనియన్ బ్యాంక్ వద్ద కొందరు కాచుకుని కూర్చుంటున్నారు. లోన్ రెన్యూవల్ కోసం రైతుకు రూ.లక్ష అవసరమైతే అక్కడే సమకూర్చుతున్నారు. తిరిగి రుణం మంజూరు కాగానే తమ డబ్బులతోపాటు రూ.2 వేల వరకు కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నారు. గంటల్లో జరిగే ఈ తతంగంతో కొందరు భారీగా లబ్ధి పొందుతుండగా, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



Renewal of Credit limits

A/c. No. :

The credit limits availed by you are due for Review / Renewal in the month of 22/08/2024.

You are requested to call on us and submit the required Provisional financial papers and other relevant information/documents urgently to enable us to review / renew the Credit Limits.

Thanking you,

Yours faithfully

బ్యాంకు అధికారులు జారీ చేసిన నోటీసు



బీబీపేట యూనియన్ బ్యాంక్‌లో క్యూలో నిల్చున్న రైతులు

# మాల మహానాడు నేతల ముందస్తు అరెస్టు



బిచ్కుంద మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం నాయకులను ఇండ్ల వద్దే అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 4: ఉమ్మడి జిల్లాలోని మాల మాహానాడు నాయకులను పోలీసులు నిర్బంధించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మంగళవారం ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. ఉమ్మడి జిల్లాలోని బోధన్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, రుద్రూర్, మోస్రా తదితర మండలాల్లో మాల మహానాడు నాయకులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్లకు తరలించారు.

ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులు




# కోడిగుడ్డు ఇవ్వలేం..

- ప్రభుత్వమే సరఫరా చేయాలి
- మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకుల డిమాండ్
- ఎల్లారెడ్డి ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4: విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోడిగుడ్డుకు ప్రభుత్వం 5 రూపాయల చొప్పున ఇస్తున్నదని, కానీ ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర ఏడు రూపాయలు ఉందని తెలిపారు. తాము విద్యార్థులకు కోడిగుడ్డును అందించలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలంటే ఒక్కో విద్యార్థికి 25 రూపాయల చొప్పున ఖర్చు అవుతున్నదని, ప్రస్తుత ధరలతో తాము భరించలేకపోతున్నామని తెలిపారు. ప్రభుత్వమే గుడ్లతో పాటు నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్ సప్లయ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని తమపై ఒత్తిడి తీసుకువస్తే రాబోయే కాలంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరి చక్రపాణి, మండల అధ్యక్షురాలు సోఫియా, కార్యదర్శి సాయిలు, మంజుల, భవానీ, రాజేశ్వరి, హుస్సేన్, లలిత పాల్గొన్నారు.